క్లుప్తంగా

వినతిపత్రం అందజేత



గార్ల: గార్ల రైల్వేస్టేషన్ అభివృద్ధి, శాతవాహన, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు కృషి చేయాలని కోరుతూ శుక్రవారం గార్లకు విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం గోపాలకృష్ణన్‌కు ప్రయాణికులు వినతిపత్రం అందజేశారు. డీఆర్‌ఎంను కలిసిన వారిలో రైల్వే డీఆర్‌సీయూ కమిటీ సభ్యులు జర్పుల లచ్చిరాం నాయక్, ఖాదర్‌బాయ్, కందునూరి ఈశ్వర్ లింగం, గుండా వెంకట్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, మనోజ్ అగర్వాల్, హతీరాం, రాజశేఖర్, వీరస్వామి, శ్రీను, బబ్లు, యాకూబ్‌పాషా, జాన్‌ఖాన్, తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్ ఎంపికలో మానుకోట జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ క్రీడాకారులు ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని కోచ్ దాక్షి అన్నారు. క్రీడాకారులు అక్షిత, అరుణ్, పరమేశ్వర్, మహేష్, చైతన్య, పీడీ పద్మావతి, విష్ణు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

గూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో బంధువైన మాజీ ఎంపీటీసీ ఐలబోయిన సమ్మక్క వీరయ్య గృహ ప్రవేశానికి మంత్రి శుక్రవారం హాజరయ్యారు. పలువురు మంత్రికి సమస్యలపై వినతిపత్రాలు అందించారు. అనంతరం టీడబ్ల్యూజేఏ జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, రమేష్‌నాయక్, కత్తి స్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్: బోనాల ఉత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరుతూ మహబూబాబాద్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం శుక్రవారం ఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్సయ్య, కవిత, వరలక్ష్మి, పద్మ, భద్రమ్మ, ఉష, భూలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

పోస్టులను భర్తీ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీడీ, పీఈటీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యుడు బానోతు బిక్కులాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం డీఈఓ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్, వీరేందర్ పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్: వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలు పాటించకుండా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోంపై చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ బీమానాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ కోరారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

స్పాట్ అడ్మిషన్లు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో అనంతారంలో ఉన్న సాంఘిక సంక్షేమ బీ ఫార్మసీ మహిళా గురుకుల కళాశాలలో ఒకేషనల్ ఫార్మా టెక్నాలజీ కోర్సులో ఖాళీగా ఉన్న ప్రవేశాలకు స్పాట్ కౌన్సిలింగ్ నేడు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హేమలత శుక్రవారం తెలిపారు.

విపత్తులపై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్డీఆర్‌ఎఫ్ (జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం) ఆధ్వర్యంలో విపత్తులపై విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం, ఎస్సై సూరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాం నిర్మించాలి

నెహ్రూసెంటర్: ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో 4వ ప్లాట్‌ఫాం నిర్మించాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీనివాస సెంటర్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెద్దవంగర: మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన పిట్టల నరేష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి స్నేహితులు బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్రులు ఆవుల మహేష్, నాగరాజు, బానోతు జైపాల్, పులుగుజ్జ శంతన్ పాల్గొన్నారు.

తల్లిపాలు.. ఆరోగ్యానికి రక్ష..!

- ఈనెల 1నుంచి 7వరకు తల్లిపాల వారోత్సవాలు

గూడూరు: తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డకు వరమని పెద్దలు చెప్తారు. తల్లిపాలు శిశువుల ఎదుగుదలకు, అవసరమైన అన్నిపోషకాలు అందించి వ్యాధుల బారిన పడకుండా కాపాడే మందులాంటిదని వైద్యులు చెబుతున్నారు. తల్లిపాలు పుట్టిన బిడ్డకు పట్టిస్తే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం కల్గి, రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. అంతటి విశిష్టత కల్గిన తల్లిపాలను బిడ్డకు ఎంత వయసు వచ్చే వరకు తాగించాలి, రోజుకు ఎన్నిసార్లు, ఎలా పట్టాలి, తల్లిపాలు పుష్కలంగా లభించాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ముర్రుపాల ప్రాధాన్యత ఏమిటి పలు విషయాలపై అందరికీ అవగాహన ఉండదు. ఈవిషయాలపై ప్రజలకు అవగాహన కల్పించి, తల్లిపాల ప్రాధాన్యాన్ని తెలిపేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1నుంచి 7వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో వారోత్సవాలు నిర్వహించనున్నారు.

మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాలను కలుపుకొని గూడూరులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఉంది. ఈప్రాజెక్టు పరిధిలో మొత్తం 3 మండలాలలో 209 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వాటి పరిధిలో 470 బాలింతలు, 557 మంది గర్భిణీలు, 0నుంచి 6సంవత్సరాల లోపు చిన్నారులు 5,306 మంది ఉన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వారందరికీ అవగాహన కల్పించనున్నారు. పుట్టిన బిడ్డకు మొదటి అరగంట లోపు తల్లులకు వచ్చే ముర్రుపాలను శిశువుకు తప్పనిసరిగా పట్టించాలి.



గుండెంగ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు (ఫైల్)

తల్లిపాలలో మాంసకృతులు, విటమిన్ 'ఏ' పుష్కలంగా ఉంటుంది. తల్లిపాలలో ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి, తేలికగా అరుగుతాయి. శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి చిన్నారులను రక్షిస్తాయి. రోజుకు 8నుంచి 10సార్లు పాలు తాగించాలి.

అవగాహన సదస్సులు నిర్వహిస్తాం..



ప్రతీ సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తాం. ఈసందర్భంగా తల్లిపాలతో బిడ్డకు కలిగే లాభాల విశిష్టతపై అవగాహన కల్పిస్తాం. గర్భిణీలు, బాలింతలు తప్పకుండా తల్లిపాల ప్రాముఖ్యతను తెల్సుకోవాలి.

- నీలోఫర్ అజ్మీ, సీడీపీఓ, గూడూరు

అభివృద్ధే ఎజెండాగా ప్రభుత్వం ముందుకు..

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్: అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ప్రభుత్వం ముందుకు పోతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శుక్రవారం మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలను ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అన్నివార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల రూ.400కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, నాయకులు ఎడ్ల రమేష్, ఖలీల్, సురేష్, గిరిధర్‌గుప్తా, నిమ్మల శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు..



17వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని రామన్నపేట కాలనీలో గల అభయాంజనేయ స్వామివారిని దర్శించుకుని ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానికులు ఎమ్మెల్యేను సన్మానించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిది

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

డోర్నకల్: పార్టీ ఫిరాయింపుల కేసులో సుప్రీం కోర్టు వెల్లడించిన తీర్పు పార్టీ మారిన ఎమ్మెల్యేలతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి సత్యావతిరాథోడ్ అన్నారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. సుప్రీం తీర్పు కాంగ్రెస్ నాయకుల్లో వనుకు పుట్టిస్తుందన్నారు. తీర్పును బీఆర్‌ఎస్ పార్టీ స్వాగతిస్తుందని, మూడు నెలల తరువాత ఉప ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్‌పై ప్రశ్నిస్తే డిప్యూటీ స్పీకర్ సమాధానాన్ని దాటవేస్తూ తనపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాంచంద్రునాయక్‌తో పాటు కాంగ్రెస్ నేతలు మాటలు మాని అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో మన్నెగూడెం పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి సీతారామిరెడ్డి, విజయపాల్‌రెడ్డి, మన్యుపాట్ని, బోడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

ఏపీఎంల బాధ్యతల స్వీకరణ

మరిపెడ రూరల్: మరిపెడ నూతన ఏపీఎంగా చింతల అలివేలు మంగమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించిన బానోతు రాములు బదిలీపై నర్సింహుల మండలానికి వెళ్లాడు.

గూడూరు: మండల కేంద్రంలోని ఉదయశ్రీ మండల సమాఖ్య, ఐకేపీ ఏపీఎంగా ఖమ్మం నుంచి బదిలీపై వచ్చిన నల్లిగంటి వీరయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి



మాట్లాడుతున్న సీఐ రాజేష్

డోర్నకల్: ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేయాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. స్థానిక బిషప్ అజరయ్య ఫంక్షన్ హాలులో శుక్రవారం ఎస్పీ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు 'మై ఆటో ఈజ్ సేఫ్' అనే క్యూఆర్ కోడ్‌పై ఆటో డ్రైవర్లను నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. ప్రతీ ఆటోకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అమరుస్తామని, క్యూఆర్ కోడ్‌లో ఆటోడ్రైవర్ల పూర్తి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ఆటోపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. ప్రతీ ఆటోకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య

నెహ్రూసెంటర్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేస్తుందని, బీసీల రిజర్వేషన్ కోసం సీపీఎం పోరాటాలు నిర్వహి స్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలను మోసగించేలా బీజేపీ ప్రవర్తిస్తున్న తీరు ఉందన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లులను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, గునిగంటి రాజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగయ్య

కళాశాలను కొనసాగించాలి

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మల్యాల గ్రామానికి మంజూరైన ఉద్యాన కళాశాలను అదే గ్రామంలో కొనసాగించాలని బీఆర్‌ఎస్ నాయకుడు ఆవుల వెంకన్న డిమాండ్ చేశారు. మల్యాల గ్రామంలో ఉద్యాన కళాశాల ఏర్పాటుపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు గుగులోతు వీరన్న, బానోత్ దాము పాల్గొన్నారు.

బోధనలో మెళకువలు పాటించాలి

గార్ల: తెలుగు బోధనలో మెళకువలు పాటించి బోధించాలని ముల్కనూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో డోర్నకల్, గార్ల, బయ్యారం మండలాల తెలుగు భాషా స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు హరీశ్, శ్రీనివాస్, అబ్దుల్ అజీమ్, అరుణబాయి, రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమేశ్

మహబూబాబాద్ అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 5వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ బాధ్యులు బాలాష్టి రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాలాష్టి రమేష్ మాట్లాడుతూ.. మార్చి నెలలో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులకు పెన్షనరీ బెనిఫిట్స్ అందించాలని, అన్నిరకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, కేజీబీవీల ఉద్యోగులకు బెసిక్ పే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, భిక్షపతి, శ్రీనివాస్, నాగరాజు, కుమారస్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

రెడ్యానాయక్‌పై విమర్శలా?

డోర్నకల్: నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ వేసిన రోడ్లపై తిరుగుతూ ఆయన్నే విమర్శిస్తున్నారని మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ విమర్శించారు. డోర్నకల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బెల్లం, బియ్యం, గ్యాస్, గుట్కా లాంటి అక్రమ వ్యాపారాలు చేసేవారు రెడ్యానాయక్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డి, జనార్దన్, మోనికాయశోధర్ జైన్, హేమచంద్రశేఖర్, బోరగల్ల శరత్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలుపుకోవాలి

గూడూరు: ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్ పెంచుతానన్న మాట నిలుపుకోవాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావుమాదిగ, జిల్లా అధ్యక్షుడు ఎండీ పాష అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వీహెచ్‌పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుర్రం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 13న మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు హైదరాబాద్‌లో జరిగే దివ్యాంగుల మహాగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాషం సాంబయ్య, చలగోల వెంకన్న, బుడిగె శ్రీరాములు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



గూడూరు: మాట్లాడుతున్న నాయకులు

నెల్లికుదురు: ఈనెల 13న చేపట్టే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోలెపాక శంకర్, ఎమ్మార్పీస్ మండల ఇన్‌చార్జ్ కొమ్ము నాగరాజు కోరారు. ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో శుక్రవారం వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి చెడుపాక లక్ష్మయ్య ఆధ్యక్షతన నూతన కమిటీని ప్రకటించారు.

సంక్షిప్త సమాచారం

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

మహబూబాబాద్: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయి, మల్లేష్, అశోక్, యాకుబ్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నెహ్రూసెంటర్: ఈనెల 9వ తేదీన జరగనున్న ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి సనప పొమ్మన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు, మధార్, భాస్కర్‌రెడ్డి, యాకయ్య, బాలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపిక



గార్ల: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు గార్లకు చెందిన ఉప్పరి శ్రీవేక్ సిద్దార్థ ఎంపికై నట్లు జిల్లా క్రీడా కోచ్ కుమార్ శుక్రవారం వెల్లడించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తొర్రూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్. రామనర్సయ్య తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కేసముద్రం: మండలంలోని ఐలయ్యతండాకు చెందిన భుక్యా హర్లా(55) అనే వ్యక్తి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెందిన హర్లా గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. దీంతో అతడిని 108లో జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారని ట్రెయినీ ఎస్సై నరేష్ శుక్రవారం తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

నెల్లికుదురు: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మాల మహానాడు అధ్యక్షుడు కారం ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యాకయ్య, సంజీవ, రమేష్, రాంబాబు, దర్గయ్య, వెంకన్న పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన జంపాలా రాజారాములు(78) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె పద్మ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చందర్ శుక్రవారం తెలిపాడు.

రెండోరోజు కొనసాగిన దీక్ష

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో గల ఓసీ క్లబ్‌ను ప్రజల బహుళ ప్రయోజనాల కోసం వినియోగించాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో నాగయ్య, ఉపేంద్రం, నారాయణ, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర ప్రదర్శన

గార్ల: పత్తిపంటలో చీడపీడల నివారణపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు రైతులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని సేరిపురం పంచాయతీలో రైతు నాదేళ్ల రామారావు పత్తిపంటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు.

మండలి సభ్యుడిగా నారాయణరెడ్డి

కొత్తగూడ: రాష్ట్ర ఉపాధి హామీ మండలి (టీఎస్ ఈజీసీ) సభ్యుడిగా మండలంలోని సాదిరెడ్డిపల్లికి చెందిన చల్ల నారాయణరెడ్డి ని నియమిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా ద్వారా ఉత్తర్వులు అందాయి.

చెక్కుల పంపిణీ

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

నేడు మండలానికి సాగు న్యాయ యాత్ర

బయ్యారం: తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎం.సునీల్ సాగు న్యాయ యాత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బయ్యారం రానున్నట్లు తహసీల్దార్ నాగరాజు శుక్రవారం తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

గూడూరు: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. అనుమానాస్పద లింకులు, ఫోన్‌కాల్స్, ఓటీపీలు, బ్యాంకింగ్ డిటేయిల్స్ ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. అదేవిధంగా సైబర్ మోసాల్లో ఒక గంటలో స్పందిస్తే కోల్పోయిన డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తొర్రూరు రూరల్: అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీఓ విజయలక్ష్మి కోరారు. శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌసియా, టీచర్స్ సోమవిజయ, పద్మ, రజిత, అరుణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ నిరంజన్, సీఐ బి.రాజేష్, శ్రీనివాస్‌యాదవ్, సుమేర్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్ర సేవలు అభినందనీయం

మరిపెడ రూరల్: ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ రజతోత్సవ సేవలు అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం సంస్థ 25 వసంతాల పోస్టర్లను ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఆరోగ్య మిత్ర వ్యవస్థాపకుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్‌తో కలిసి ఆవిష్కరించారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఇవ్వాలి



మహబూబాబాద్: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్: వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సత్యం, వీరన్న డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర కమిటీ వ్యవసాయ కూలీలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, యాకయ్య, ఎల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా ఇవ్వాలని ఆందోళన

బయ్యారం: వ్యవసాయకూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12వేలను అందజేయాని కోరుతూ శుక్రవారం అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని జగ్గుతండా పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సత్యం, సూర్యం, స్థానికులు చంద్రు, లక్ష్మి, కోటియా పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మహబూబాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ డిగ్రీలో ప్రథమ సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూప్‌లో ప్రవేశాలకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 13న చివరి తేదీ అని అర్హులైన విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఓపెన్ యూనివర్సిటీ సమన్వయకర్త హతిరామ్‌నాయక్ శుక్రవారం తెలిపారు. వివరాలకు 73829 29705 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కాషాయజెండా ఎగురవేస్తాం..

డోర్నకల్: రాబోయే రోజుల్లో ఊరూరా కాషాయజెండా ఎగురవేస్తామని బీజేపీ మండల నాయకుడు ధారావత్ నరేష్‌నాయక్ తెలిపారు. డోర్నకల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో యువతను బీజేపీలో చేర్పిస్తూ స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, బాసాని నాగేశ్వర్‌రావు, రెహమాన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం కావాలి


కొత్తగూడ: గంగారం మండలం బర్లమల్లయ్యగుంపు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఈక అభి గుండె ఆపరేషన్‌కు ప్రభుత్వ సాయం కావాలని ఆర్‌బీఎస్‌కె బృందం శుక్రవారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఆపరేషన్‌కు డబ్బులు చెల్లించే స్తోమత బాలుడి తండ్రి ఈక రవీందర్‌కు లేదని సిబ్బంది వివరించారు. స్పందించిన సీతక్క ఎల్‌ఓసీ ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బదిలీ

దంతాలపల్లి: దంతాలపల్లి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుధారాణిని బదిలీ చేసినట్లు సీడీపీఓ ఎల్లమ్మ శుక్రవారం తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమ్మరికుంట్ల గ్రామంలో విచారణ చేశామన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ శిరీష ఆదేశాల మేరకు మరిపెడ మండలం తాళ్లకల్ సెక్టార్‌కు బదిలీ చేసినట్లు ఎల్లమ్మ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: నేడు జరగనున్న ఉపాధ్యాయుల ప్రమోషన్‌లో గిరిజన, ఎస్సీ ఉపాధ్యాయులకు అడ హాక్ క్వాసి, అక్వైరింగ్ క్వాలిఫికేషన్ విధానంతో తీవ్రనష్టం జరుగుతుందని, దీనిని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. భద్రనాయక్ అన్నారు. శుక్రవారం డీఈఓ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గిరిజన ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం 10శాతం రిజర్వేషన్‌తో ప్రమోషన్ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు లచ్చిరాం నాయక్, కిషన్‌నాయక్, రవీందర్‌నాయక్, రుప్ల, చాగంటి ప్రభాకర్, భావ్ సింగ్, మోహన్, కిరణ్ సింగ్ పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కురవి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. సీరోలు మండలం కాంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిరుపేద లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నంచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, నాయకులు సతీష్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డు అందిస్తాం..

మరిపెడ: అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్ కార్డు అందజేస్తామని ఆర్‌ఐ శరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో రేషన్ కార్డులను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అప్సర్, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.